9 వరకు ఓటరు నమోదుకు గడువు

ధర్మవరం టౌన్ : పట్టణంతో పాటు రూరల్ ప్రాంతాల్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటు నమోదు కోసం ఫారం–6 ద్వారా డిసెంబర్ 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని తహశీల్దార్ యుగేశ్వరిదేవి సూచించారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఆర్డీవో రమేష్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రస్తుతం బిఎల్‌ఒలపైన పర్యవేక్షణ కొనసాగుతోందని, నూతనంగా ఓటు హక్కు పొందాలనుకునే వారు బిఎల్‌ఒల వద్ద గానీ, తహశీల్దార్ కార్యాలయం వద్ద గానీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే చేర్పులు, మార్పులు, బదిలీలు, నూతనంగా ఓటు హక్కు కోసం ఆన్‌లైన్‌లో అర్బన్‌లో 4వేల మంది రూరల్‌లో 800 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులపై విచారణ నిమిత్తం బిఎల్‌ఒలు తమ ఇంటి వద్దకు వచ్చినప్పుడు సరైన ఆధారాలతో వారికి సహకరించాలని సూచించారు. ఇప్పటివరకు 80 శాతం పని చేశామని తెలిపారు. ఓటు హక్కు పొందడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తెలిపారు. ఓటు హక్కుతోనే మంచి నాయకున్ని పొందే అవకాశం ఉంటుందన్నారు. పట్టణ, రూరల్ ప్రజలు ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దు కోవాలని తెలిపారు.

తొలగని లంపీస్కిన్ గుబులు

◆ పశువుల చర్మంపై దద్దుర్లు ◆ పాడి రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పాడి రైతులకు ఇప్పటికీ లంపి స్కిన్ (ముద్ద చర్మం) గుబులు తొలగడం లేదు. గతేడాది ఈ జబ్బుతో పెద్దఎత్తున ఆవులు, దూడలు ఈ జబ్బుబారినపడి చనిపోయాయి. చర్మం ముద్దగా మారి, మేత కూడా తినలేని పరిస్థితుల్లో చనిపోతూ వచ్చాయి. ఒక దాని నుంచి మరొకదానికి అంటు వ్యాధి కూడా కావడంతో నియంత్రించడం ఇబ్బందిగా మారింది. వ్యాక్సిన్ ద్వారా అరికట్టే చర్యలు చేపట్టారు. అయినా ఈ ఏడాది ఉమ్మడి అనంతపురం జిల్లాలో అక్కడక్కడ లంపిస్కిన్ జబ్బు బారిన జంతవులున్నాయి.

చాపకింద నీరులా లంపిస్కీన్

లంపిస్కిన్ ఈ ఏడాది చాపకింద నీరులా వ్యాప్తి చెందుతూనే ఉంది. పెద్దపప్పూరు మండలంలో రెడ్డిపల్లితోపాటు మూడు గ్రామాల్లో మూడు ఆవులు దీనిబారినపడి మృత్యువాతపడ్డాయి. మరికొన్ని ఇప్పటికీ దీని బారినపడిన దూడలున్నాయి. అదే విధంగా బొమ్మనహాల్ మండలంలోని దర్గాహొన్నూరు, గోవిందవాడ, బొల్లనగుడ్డం గ్రామాల్లో ఈ జబ్బుబారిన పడిన పశువులు అత్యధికంగానున్నాయి. పుట్లూరు మండలంలోని లంపిస్కీన్, అదే రకంగా తీవ్రమైన జ్వరాలతోనూ ఏకంగా 40 ఆవులు మృత్యువాతపడ్డాయి. సత్యసాయి జిల్లాలో పలుచోట్ల దీనిబారినపడిన ఆవులు, దూడలున్నాయి. వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ఆవులు, దూడలు చనిపోతాయన్న ఆందోళన పాడి రైతుల్లో నెలకొంది.

వైద్యసేవల్లోనూ ఇబ్బందులు

రోగాల బారినపడిన పశువులకు వైద్యసేవలందించడంలోనూ ఇబ్బందులు తప్పడం లేదు. తగినంత మంది పశువైద్యుల్లేకపోవడంతో కూడా సమస్యగా మారింది. పుట్లూరులోనూ ఇదే రకమైన సమస్య ఉండగా, బొమ్మనహాళ్‌లో పశువుల అంబులెన్సులున్నా ఆశించిన ప్రయోజనం ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సిబ్బంది మాత్రం టీకాలు వేయని వాటికి మాత్రమే ఈ ఏడాది వస్తున్నట్టు చెబుతున్నారు.

టీకాలు వేయని వాటికే ఈ జబ్బు

జిల్లాలో అక్కడక్కడా ఈ జబ్బు లక్షణాలున్న మాట వాస్తవమే. గతేడాది జబ్బు వచ్చిన సమయంలో గర్భంతోనున్న వాటికి, దూడలకు ఈ వ్యాక్సిన్ వేయలేదు. ఎందుకంటే గర్భంతోనున్న వాటికి వేస్తే అబార్షన్ అయ్యే అవకాశముంది. అందుకే వేయలేదు. గతంలో వ్యాక్సిన్ వేయని వాటిపైనే దీని ప్రభావముంది. ఎక్కువగా దూడలకు వస్తోంది. గతంలో వేయకుండా మిగిలిపోయిన వాటికి కూడా ఈ ఏడాది వ్యాక్సినేషన్ చేయడం జరుగుతోంది. చాలా వరకు నియంత్రణలోనే ఉంది. పుట్లూరులో ఎక్కువ పశువులు చనిపోయినట్టు తమకు సమాచరమొస్తే వైద్య బృందాన్ని పంపించి పరిశీలించాం. అందులో కొన్ని ప్లాస్టిక్ వంటివి తిని చనిపోయినట్టు తేలింది. మరికొన్ని జ్వరాలతో చనిపోయాయి. లంపిస్కిన్‌తో చనిపోలేదు.

సుబ్రమణ్యం, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

కేంద్ర మంత్రి శోభాకరం ధాలాజీ

మహిళా సదస్సులో పాల్గొన్న మహిళలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగి, అన్ని రంగాల్లో రాణించాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శోభాకరం ధాలాజీ పిలుపునిచ్చారు. సత్యసాయి బాబా 98వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నాడు ప్రశాంతి నిలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్రమంత్రితో పాటు హెచ్‌హెచ్.రాజమాత ప్రమోదా దేవి వడియార్ పాల్గొన్నారు. ఉదయం సత్యసాయి విద్యార్థులతో కలిసి మహిళలు పెద్ద ఎత్తున సభా వేదిక వద్దకు ర్యాలీగా చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కేంద్రమంత్రి మహిళలను ఉద్దేవించి ప్రసంగించారు. ఈ ఏడాది మహిళా దినోత్సవానికి ప్రశాంతి నిలయానికి రావడం సంతోషంగా ఉందన్నారు. సత్యసాయి మహిళా సమానత్వం ఉండాలని కోరుకునేవారన్నారు. నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. భారతదేశ సాంస్కృతి సాంప్రదాయాలు చాలా గొప్పవన్నారు. ప్రపంచ దేశాలు సైతం భారత సాంప్రదాయాలను ఎంతో గౌరవిస్తారని చెప్పారు. సత్యసాయి తన ఆధ్యాత్మిక బోధనలలో కూడా మహిళల పాత్ర గొప్పదని చెప్పిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. మహిళలు స్వశక్తితో ఎదగాలన్నారు. మహిళా శక్తి ఏమిటో నిరూపించుకోవాలన్నారు. రాజమాత ప్రమోదా దేవి మాట్లాడుతూ, 1990లో తాను మొదటిసారిగా ప్రశాంతి నిలయాన్ని సందర్శించినట్లు చెప్పారు. సత్యసాయి మైసూర్ ప్యాలెస్‌కు వచ్చిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. మహిళలకు ఆత్మగౌరవం నింపడానికి సత్యసాయి ట్రస్ట్ చేస్తున్న కషి ప్రశంసనీయమన్నారు. యూరోపియన్ దేశాల సలహాదారు పెట్రో కాలినో వ్యాలీ మాట్లాడుతూ సత్యసాయి అందించిన సేవలను అనుసరించి మహిళా ట్రస్టు కార్యకలాపాలలో వారి పాత్ర గొప్పదన్నారు. ఏటా మహిళా దినోత్సవం జరుపుకుంటూ మహిళా శక్తిని సమాజంలో మహిళా పాత్ర గురించి చర్చించుకోవడం మంచి సాంప్రదాయం అన్నారు. సాయంత్రం రఘునాథన్ బందం నిర్వహించిన కచేరి అలరించింది. సత్యసాయి విద్యార్థులు నిర్వహించిన నాటికలు ఆకట్టుకున్నాయి.

మహిళా దినోత్సవంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి

నూతన కేథరైజ్ ల్యాబ్ ప్రారంభం

ల్యాబ్ ను ప్రారంభించి పరిశీలిస్తున్న ట్రస్టు సభ్యులు

సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అత్యాధునికి కేథరైజేషన్ లేబరేటరీని సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ ఆదివారం ప్రారంభించారు. ఆదివారం ప్రశాంతిగ్రామ్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో రూ.4.2 కోట్లతో ఈ లేబరేటరీని నిర్మించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, కార్డియాలజీ విభాగంకు ఈ లేబరేటరీ అనుసంధానంగా ఉంటుందన్నారు. హృదయ సంబంధ వ్యాధులను నిర్ధారించడానికి, చికిత్సలు అందించడానికి ఉపయోగ పడుతుందన్నారు. రోగ నిర్ధారణ చేయడం, గుండెకు సంబంధించిన వ్యాధులకు మెరుగైన చికిత్సలు అందించడానికి ల్యాబ్ ద్వారా సులభతరం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు చక్రవర్తి, నాగానంద, నిమీస్‌పాండే, ఆస్పత్రి డైరెక్టర్ గురుమూర్తి, డాక్టర్ విఆర్‌అయ్యర్, కార్డియాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా గుడికట్ల సంబరాలు

◆ నగరంలో భారీ ర్యాలీ
◆ భీరప్ప స్వాముల ఊరేగింపు
◆ హెలీక్యాప్టర్‌లో పూల వర్షం

గుడికట్ల కార్యక్రమంలో పాల్గొని కురుబ కులస్తులకు అభివాదం చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కురబలకు సంబంధించిన గుడికట్ల ఉత్సవాలు ఆదివారం నాడు అనంతపురం నగరంలో అంగరంగ వైభవంగా జరిగాయి. 800 సంవత్సరాల తరువాత ఈ ఉత్సవాన్ని ఇంత పెద్దఎత్తున నిర్వహించినట్టు ఆ సంఘం నాయకులు తెలిపారు. అనంతపురం నగరంలోని జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన ఉత్సవానికి ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 252 గుడికట్లు ట్రాక్టర్లపై ఉరేగిస్తూ తీసుకొచ్చారు. బళ్లారి బైపాస్ నుంచి జూనియర్ కళాశాల వరకు ట్రాక్టర్లలో వీటిని తీసుకొచ్చారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నగరంలోని టవర్ క్లాక్, సప్తగిరి శ్రీకంఠం సర్కిళ్ళు, కళ్యాణదుర్గం రోడ్డు, జెఎన్‌టియు, ఎస్‌కెయు రోడ్డు పలు ప్రాంతాల్లో కురబలు భారీ ర్యాలీలు ఊరేగింపులు చేపట్టారు. నగరంలోని ప్రధాన రహదారులన్నీ కురుబల ప్రదర్శనలతో నిండిపోయాయి. ఈ సమయంలో పెద్దఎత్తున ట్రాఫిక్ సమస్యలు నెలకొన్నాయి. టవర్‌క్లాక్ నుంచి సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్, జూనియర్ కళాశాల మైదానం వరకు భీరప్ప స్వాములను ఊరేగించారు. అన్ని స్వాములను ఒకచోట ఉంచి పూజలు నిర్వహించారు. 250 గుడికట్లకు హెలీక్యాప్టర్ ద్వారా పూల వర్షం కురిపించారు. లహరి డ్యాన్స్ అకాడమీ, మక్బూల్ అకాడమీల ఆధ్వర్యంలో చిన్నారులు, యువత సాంప్రదాయ, జానపద, వెస్టర్న్ నృత్యాలతో అలరించారు. గొరవయ్యల విన్యాసాలు, ఉరుములు, డ్రమ్స్ వాయిద్య విన్యాసాలు ఆకట్టుకున్నాయి. అనంతరం కురుబ సంఘం జిల్లా అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించిన సంబరాలకు మంత్రి ఉషాశ్రీచరణ్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, పెనుకొండ ఎమ్మెల్యే శంకర్‌నారాయణ, టిడిపి శ్రీసత్యసాయి జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు బికె.పార్థసారథి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ కురుబ యాదవ సాధికార సమితి రాష్ట్ర కోఆర్డినేటర్ శివబాలతోప ఆటు పెద్ద ఎత్తున కురుబలు హాజరయ్యారు. కురుబల ఐక్యతను బలపరిచేలా నాయకులు అభివాదాలు చేశారు. ఎనిమిది సంవత్సరాల క్రితం కురుబల ఉనికిని చాటే గుడికట్ల సంబరాలు తిరిగి ప్రజలకు తెలిసేలా కురుబల ఐక్యతను మరింత పటిష్టపరిచేలా ఈ ఉత్సవాలను మొట్టమొదటిసారి అనంతపురం జిల్లాలో నిర్వహించటం గర్వకారణంగా ఉందని శ్రీనివాసులు ఉన్నారు. 252 గుడికట్లను కలిపి నగరంలో ఊరేగింపు చేయడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో కురుబ సంఘం గౌరవాధ్యక్షులు నారాయణ, ట్రెజరర్ నాగన్న, కళ్యాణమండపం ప్రతినిధి కొనకొండ్ల, రాజేష్, లక్ష్మి, పిడుగు కృష్ణమూర్తి, కురుబ సంఘం నేతలు ఎమ్‌డీ నాగభూషణం గురువు నారాయణస్వామి పాల్గొన్నారు.

గుడికట్లలో రాజకీయరచ్చ..!

◆ టిడిపి వర్సెస్ వైసిపిగా మారిన బహిరంగసభ
◆ వేదికపైనే నాయకుల మధ్య తోపులాట

సభావేదికపై వాదించకుంటున్న ఎంపీ గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథి

కురుబలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గుడికట్ల కార్యక్రమం రాజకీయ వేదికగా మారింది. నేతలు ఒకరిపై ఒకరు దూషణలు చేసుకున్నారు. కురబలంతా ఐక్యంగానున్నారు.. నాయకులే సరిగాలేరని ఎంపీ గోరంట్ల మాధవ్ వ్యాఖ్యలు చేశారు. తాను చేసిన వ్యాఖ్యలకు నిదర్శనం వేదికపైనున్న నాయకులేనని బికె.పార్థసారథిని ఉద్దేశించి మాట్లాడారు. దీంతో పార్థసారధి, గోరంట్ల మాధవ్ మధ్య వివాదం చోటు చేసుకుంది. ఇద్దరు నేతలకు సంబంధించిన మద్దతుదారుల మధ్య తోపులాట జరిగింది. వారి అనుచరులు కూడా వేదికపైనే ఒకరిపై ఒకరు దూషణలకు దిగారు. సాంప్రదాయాల కోసం కురుబల ఐక్యత కోసం ఏర్పాటు చేసిన వేదిక ఒక్కసారిగా రాజకీయ వేదికగా మారింది. దీంతో బహిరంగ సభకు వచ్చిన కురబకులస్తులు అందరూ ఒక్కసారిగా అవాక్కు అయ్యారు. కురుబల ఐకమత్యం కోసం ఏర్పాటు చేసిన స్టేజీపైన ఇలా వ్యవహరించడం సరైంది కాదని సంఘం నాయకులు తెలిపారు. పోలీసులు కూడా అక్కడికి చేరుకుని సర్దిజెప్పారు. అక్కడి నుంచి గోరంట్ల మాధవ్, మంత్రి ఉషశ్రీచరణ్ వెళ్లిపోయారు. సభావేదికపై ఉన్న ఇతర నేతలు, పోలీసులు కలుగజేసుకుని దూషణలు చేసుకుంటున్న వారికి సర్ధిచెప్పి శాంతింపజేశారు. దేవుడి కార్యం వెనుక రాజకీయం ఏమిటంటూ అక్కడున్న వాళ్లంతా నేతలపై అసహనం వ్యక్తం చేశారు.

కలెక్టర్‌నే బోల్తా కొట్టించిన ఘనులు...!

◆ ప్రజాభిప్రాయ సేకరణకు స్థానికులకు సమచారం లేదు... ◆ హాజరైన ఇతర జిల్లాల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

పరిశ్రమల నుంచి వెదజల్లుతున్న పొగ

ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న కలెక్టర్ (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం దేవరపల్లి సమీపంలో ఉన్న గోళాపురం పారిశ్రామిక వాడలోని శ్యామ్ ఫెర్రస్ లిమిటెడ్, ఎంఎస్ బిల్లేట్లు టిఎంటి బార్‌లు తయారీ పరిశ్రమల విస్తరణ కోసం ఈ నెల 15న బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, పరిశ్రమల నిర్వహకులు కలిసి సాక్షత్తు జిల్లా కలెక్టర్‌నే బోల్తా కొట్టించారు. ప్రజాభిప్రాయ సేకరణకు తప్పకుండా గ్రామంలో దండోర వేయించి అందరికీ సమచారం ఇచ్చి అభిప్రాయ సేకరణ చేయాల్సి ఉండగా ఇతర జిల్లాల స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను, సర్పంచి ఆయన కావాల్సిన పది మందితో తూతూమంత్రంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి కాలుష్య నియంత్రణ మండలి అధికారులు చేతులు దులుపుకున్నారు.

రాష్ట్రంలోనే మూడవ అతి పెద్ద పారిశ్రామిక వాడ హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురంలో ఉన్నాయి. ఇక్కడ చిన్నవి, పెద్దవి కలిపి దాదాపు 130 వరకు పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమల నిర్వహకులు నిబంధనల మేరకు కార్పొరేట్ సామాజిక భాధ్యత కింద గ్రామాల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేయడానికి సాధ్యం ఉంది. అయితే కేవలం లాభార్జనే లక్ష్యంగా కార్పొరేట్ సామాజిక బాధ్యతను మరచి స్వలాభాన్ని చూసుకుంటున్నారు. బంగారాన్ని పండించే భూములను ఇచ్చిన రైతులకు పారిశ్రామిక వేత్తలు కాలుష్యాన్ని బహుమతిగా ఇస్తున్నారు. దీనిపై ఎవరైన ప్రశ్నిస్తే నష్టాలను చూపిస్తున్న పారిశ్రామికవేత్తలు వారి పరిశ్రమలను ఏ విధంగా విస్తరణ చేస్తున్నారో అర్థం కావాడం లేదు. ఇప్పటికే గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్నా శ్యామ్ ఫెర్రస్ లిమిటెడ్, ఎంఎస్ బిల్లేట్లు టిఎంటి బార్‌లు తయారీ పరిశ్రమల నిర్వహకులు వారి పరిశ్రమలను విస్తరించడానికి ప్రభుత్వనికి ధరఖాస్తు చేసుకున్నారు. దీనిపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గత బుధవారం రూరల్ మండలం దేవరపల్లి వద్ద కలెక్టర్ అధ్యక్షతన పెనుగొండ సబ్ కలెక్టర్ కార్తీక్, ఎపిపిసిబి ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ పివి.కిషోర్ రెడ్డి, ఎపిపిసిబి ఎఈఈ కృష్ణారెడ్డిలు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారు. ఈ రెండు పరిశ్రమల నిర్వహకులు పరిశ్రమను స్థాపించి ఆయా గ్రామాల అభివృద్ధికి చేసింది శూన్యం. కనీసం స్థానికులకు ఉపాధి సైతం కల్పించలేదు. అయినప్పటికీ మరింత భూమిని కేటాయించి, పరిశ్రమల విస్తరణ కోసం గుట్టుచప్పుడు కాకుండా పరిశ్రమల నిర్వహకులు ఇస్తున్న మాముళ్లు తీసుకుని అనుమతులను ఇవ్వాడానికి అధికారులు సిద్ధం అయ్యారు. ఇది చాలదన్నట్లు జరిగిన ప్రజాభిప్రాయ సేకరణకు ఉమ్మడి జిల్లాలతో పాటు హిందూపురం ప్రాంతంలో ఉన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, గ్రామస్తులకు సమచారం లేదు. ఇక్కడ గమ్మత్తేమిటంటే ప్రజాభిప్రాయ సేకరణలో బయట ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వచ్చి పరిశ్రమల విస్తరణకు అనుకూలంగా మాట్లాడడం, నివేదికలు ఇవ్వడం చూస్తుంటే స్థానికులు నివ్వెరపోతున్నారు. కనీసం స్థానికంగా ఉన్న పాత్రికేయులకు సైతం సమచారం ఇవ్వలేదంటే ఈ ప్రజాభిప్రాయ సేకరణ ఎలా నిర్వహించారో అర్థం చేసుకోవచ్చు. ప్రజాభిప్రాయ సేకరణలో తమకు అనుకూలంగా కొంతమంది చేత చెప్పించేందుకు స్థానికంగా కొంత మంది ప్రజాప్రతినిధులు, అధికారులకు పరిశ్రమల వారు లక్షలాది రూపాయలు ముట్ట చెప్పినట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

తూమకుంట, గోళాపురంలో ఉన్న పరిశ్రమలు వెదజల్లే కాలుష్యం వల్ల ఇప్పటికే పరిశ్రమల చుట్టు పక్కల గ్రామాల వారు ఎన్నో వ్యాధులకు గూరి అవుతున్నారు. ఇది చాలదన్నట్లు చేతికి వస్తున్న పంటులు సైతం పరిశ్రమల వల్ల తమ గ్రామంలో ప్రజలు పలు ఇబ్బందులకు, అనారోగ్యాలకు గురవుతున్నారని, పశువులకు తాగునీరు, పంట పొలాలకు సాగునీరు అందకుండా పోతుందని గగ్గోలు పెడుతున్నారు. అయినా అధికారులకు ఇవేమీ పట్టలేదు. తమకు ముడుపులు ముడితే ప్రజల ఆరోగ్యాలతో పనేమీ అన్నట్టు వ్యవహరిస్తున్నారు. ఉపాది కల్పించే పరిశ్రమలు వస్తాయని అనుకుంటే రోగాలు వచ్చే పరిశ్రమలు వచ్చాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఈ విషయాలపై ఎన్నో సార్లు ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఈ విషయంపై కాలుష్య నియంత్రణ మండలి అధికారులను సంప్రదిస్తే వారి నుంచి నిర్లక్ష్య సమాధానాలే వస్తున్నాయి. ఇప్పటికైన కలెక్టర్ వీటిపై ప్రత్యేక దృష్టి సారించి తూమకుంట, గోళాపురంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలను కాలుష్యం నుంచి కాపాడాని ఇక్కడివారు కోరతున్నారు.

కార్మిక చట్టాలను కాలరాస్తున్న ప్రభుత్వాలు

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలోని సిఐటియు కార్యాలయంలో ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించే 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలో 'చలో విజయవాడ' బుక్ లెట్స్‌ను విడుదల చేశారు. రమేష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు, హక్కుల పునరుద్ధరణ, నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు, పని భద్రత, అసంఘటిత రంగ కార్మికులందరికీ రిజిస్ట్రేషన్‌తో పాటు పెన్షన్, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులు, చట్టాలను కాలరాస్తున్నాయని, తద్వారా ఎంతోమంది కార్మికులు, ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు. కార్మికుల సమస్యలపై చేపట్టనున్న 36 గంటల దీక్షలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ రైతులకు సంబంధించిన వ్యవసాయ మోటార్లకు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు బిగించడం ఆపాలని, పంటలన్నిటింకీ ఆహార, వాణిజ్య, ఉద్యాన, సామాజిక వన సమగ్ర ఉత్పత్తి వ్యయాన్ని ఎంఎస్‌పిలను నిర్ణయించి చట్టబద్ధత కల్పించాలని కోరారు. రైతులు, పేదల పాలిట ఉరితాడు కాగల ఎలక్ట్రిసిటీ బిల్లును ఉపసంహరణ చేయాలని, కేరళ తరహాలో రైతులకు రుణ ఉపశ మన చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించి రైతుల ఆత్మహత్యలను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉన్న ప్రధానమంత్రి పంటల బీమా పథకాన్ని ఉపసరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు తిప్పన్న, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు బావమ్మ, సివిల్ సప్లైస్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, నగర పంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు చిన్న వెంకటేష్, ఆటో యూనియన్ నాయకులు మూర్తి, పాల్గొన్నారు.

జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా జెపికె.రాము

రాముకి నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షునిగా హిందూపురం పట్టణానికి చెందిన మున్సిపల్ మాజీ ఛైర్మన్ జెపికె.రాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని వాసవీ భవన్‌లో ఆదివారం ఆర్యవైశ్యుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా ఉమ్మడి అనంతపురం జిల్లాల అధ్యక్షుడు కలవల రామ్‌కుమార్, రాష్ట్ర మహాసభ రాజకీయ విభాగం అధ్యక్షుడు కోటా సత్యనారాయణ, జిల్లా మాజీ అధ్యక్షుడు వంగదారి వెంకటేష్ వ్యవహరించా రు. ఆర్యవైశ్యులు ఎన్నికల్లో ఎవరైనా పోటీ చేయవచ్చని ప్రకటించారు. అయితే నూతన జిల్లాలో పోటీ వద్దని సమిష్టిగా ఏకగ్రీవ ఎన్నికకు అందరూ సహకరించినందున రాము ఎన్నిక సులభమైంది. రాము మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం నూతన అధ్యక్షుడిని ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు. సమావేశంలో సంఘం నాయకులు మనోజ్‌కుమార్, వరప్రసాద్, బైసాని రాంప్రసాద్, మాజీ సర్పంచి కృష్ణమూర్తి, పోలేపల్లి ప్రశాంత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ అకౌంట్ నిబంధన రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యాదీవెన, వసతి దీవెన పథకాలకు తల్లి, విద్యార్థికి ఉమ్మడిగా బ్యాంక్ అకౌంట్ ఉండాలన్న నిబంధనను వెంటనే రద్దు చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి బాబావలి డిమాండ్ చేఢశారు. ఈ విషయంపై ఆదివారం పట్టణంలోని బిసి కళాశాల వసతి గృహంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బాబావలి మాట్లాడుతూ ఈ నిబంధన వల్ల ప్రయోజనం లేకపోగా చాలా నష్టం జరుగుతుందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ అకౌంట్ నిబంధనను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రూ. 1600 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చంద్రశేఖర్, తరుణ్, నిహాల్, రాజా, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బాబావలి

ట్రాక్టర్ ద్వారా తరలిపోతున్న ఎర్రమట్టి, కొండలో జెసిబితో తవ్విన ఎర్రమట్టి

యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

నంబులపూలకుంట ప్రాంతంలో ఒకప్పుడు కొండలు, గుట్టలు బాగా ఉండేవి. సోలార్ పవర్ ప్రాజెక్టు రావడంతో 70 శాతం తరిగిపోయాయి. ఇప్పుడు మండల కేంద్రానికి, పర్యావరణానికి అలంకారంగా ఉండే నడింబోటు, బోటు కొండలపై మట్టి మాఫియా కన్ను పడింది. ఈ కొండల్లో ఎర్ర మట్టి ఎక్కువగా ఉండడంతో మట్టి మాఫియాదారులు కొండల వద్ద జెసిబిలు ఏర్పాటు చేసి పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వుతూ లారీలు, ట్రాక్టర్ల ద్వారా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాల్లో అయితే మరింత ఎక్కువగా తరలిస్తున్నారు. మండల కేంద్రంలో మట్టి వ్యాపారం జోరుగా జరుగుతుంది. ఒక ట్రాక్టర్ మట్టి రూ. 800తో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కొండలు, గుట్టల నుంచి మట్టి తరలించాలంటే మైన్స్ అండ్ రెవెన్యూ అధికారుల అనుమతులు ఉండాలి. కానీ ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యాంగి మట్టి వ్యాపారం సాగుతున్నట్టు తెలుస్తోంది. సామాన్యులు సొంత అవసరాలకు మట్టి తరలించాలంటే ఎన్నో నిబంధనలు పెట్టే అధికారులు మట్టి మాఫియాను మాత్రం అడ్డుకోలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కొండలు, గుట్టల నుంచి మట్టిని తరలించడం వల్ల పశుగ్రాసం కొరత ఏర్పడే ప్రమాదం ఉందని పాడిరైతులు పేర్కొంటున్నారు. కొండలు, గుట్టల్లో చెట్లు పెంచి పర్యావరణాన్ని కాపాడాల్సిన అధికారులు మట్టి మాఫియాకు వత్తాసు పలుకుతుండడంతో అవి కరిగిపోతున్నాయని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాను అరికట్టి కొండలు, గుట్లను పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆ డిపోలో అన్నీ ఏకపక్ష నిర్ణయాలే..!

కార్మికులు, ఉద్యోగులపై ఉన్నతాధికారి వేధింపులు
ఇష్టారాజ్యంగా బస్సులు రద్దు
ఇబ్బందుల్లో ప్రయాణికులు

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర ఆర్టీసీ డిపోలో ఉన్నతాధికారి ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. ఉన్న బస్సులను రద్దు చేయడం, కార్మికులను వేధిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. గతంలో ప్రయాణికులకు అనుకూలంగా ఉండే బస్సులను రద్దుచేసి ఆయన ఏకపక్షంగా బస్సులు నడపడంతో డిపోకు నష్టంతో పాటు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నట్లు తెలుస్తోంది. గతంలో తిరుగుతున్న ఎం,రాయపురం రాత్రి బస్సును ఇప్పుడు పూర్తిగా రద్దు చేశారు. రొళ్ల, పావగడ వయా లక్ష్మీపురం, గుండుమల, రాళ్లపల్లి మీదగా ఈ సర్వీస్ నడిచేది. దీనిని రద్దు చేయడంతో ఆ ప్రాంతం ద్వారా ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హిందూపురం, శిర బస్సు సర్వీసును ఉదయం శిర నుంచి హిందూపూర్‌కు తిప్పాల్సి ఉంది. బాలేపల్లి నైట్ అవుట్ సర్వీసును పున:ప్రారంభించాలని ప్రయాణికులు కోరుతున్నా స్పందించే వారు కరువయ్యారు. మడకశిర, బెంగళూరు, అనంతపురం సర్వీసును రద్దు చేశారు. మీడిగేసి, శిర వయా మధుడి, కొమురేపల్లి మీద రొళ్ల నైట్ అవుట్ సర్వీసును కూడా తీసేయడంతో ఆ ప్రాంతం ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దొడ్డేరి, కైమర సర్వీసును కూడా ఇలాగే రద్దు చేశారు. దొడ్డేరి సర్వీస్‌ను ఉంటే మడకశిర నియోజకవర్గంలో గుడిబండ, రొళ్ల మండల ప్రజల ప్రయాణానికి అనువుగా ఉంటుంది. ఈ సర్వీసునూ డిపో ఉన్నతాధికారి ఏకపక్ష నిర్ణయంతో రూటును మార్చి పెనుగొండ నియోజకవర్గం రొద్దం మండలం వెంకటాపురం, గువ్వలపల్లి మీదగా నడుపుతున్నారు. ఈ బస్సును దారిమార్చడంతో మడకశిర ప్రాంత ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాదాపుగా 7 సర్వీసులను డిపో మేనేజర్ ఆయన సొంత అభిప్రాయం, ఏకపక్ష నిర్ణయాలతో మార్పు చేయడంతో డిపోకు రావాల్సిన ఆదాయం గణనీయంగా తగ్గిందనే అభిప్రాయాన్ని డ్రైవర్లు, కండెక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. ఈ సర్వీసులను పునరుద్ధరించాలని ప్రజలు వెళ్లి డిపోలో అడిగితే ఉన్నతాధికారి పంపుతామని వారికి చెబుతున్నారనే తప్పా, ఆచరణలో దానిని అమలు చేయడం లేదు. కార్మికుల పట్ల కూడా సదరు అధికారి కక్షపూరిత వైఖరి అవలంభిస్తున్నారనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. వైద్యం, సెలవుల విషయంలో కార్మికులకు అన్యాయం జరుగుతున్నట్లు తెలుస్తోంది. 55 సంవత్సరాలు నిండిన వారికి, దీర్ఘకాల ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి ట్రాఫిక్ ఆపరేషన్ ఈడి విజయవాడ ఇచ్చిన సర్కులర్ ప్రకారం బడి బస్సులకు పంపాలనే నిబంధన ఉంది. ఈ నిబంధన కూడా మడకశిర డిపోలో అమలుకావడం లేదు. ఆ అధికారి నిర్ణయాలతో కండెక్టర్లు, డ్రైవర్లతో పాటు డిపో సిబ్బంది కూడా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక యూనియన్ నేతలను కూడా గుర్తించకుండా ఇబ్బందులకు చేస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్న డిఎంపై చర్యలు తీసుకోవాలని మడకశిర ఆర్టీసీ డిపో కార్మికులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

కారు ఢీకొని మున్సిపల్ కార్మికుడు మృతి

హిందూపురం : గొల్లపల్లి రిజర్వాయర్ నీటి విభాగంలో కొట్నూరు సంపు వద్ద పని చేస్తున్న మున్సిపల్ కార్మికుడు తాహిర్(24) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. అతడు రాత్రి పట్టణానికి వచ్చి భోజనం చేసి తిరిగి సంపు వద్దకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా పెట్రోల్ బంకు సమీపంలో సోమందేపల్లి నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అదేకారులో పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న వన్ టౌన్ ఎస్ఐ హారున్‌బాషా ప్రమదానికి కారణమైన కారును సీజ్ చేసి, డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాహిర్

హత్య కేసులో నిందితులు అరెస్ట్

కదిరి టౌన్ : ఈ నెల 14వ తేదీ పట్టణంలో జరిగిన దేరంగుల శ్రీకాంత్ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. పట్టణంలోని నిజాంవలి కాలనీ పుట్టగడ్డ వీధికి చెందిన రామాంజనేయులు భార్య హనుమక్కను శ్రీకాంత్ వేధించేవాడు. దీంతో భార్యాభర్తలు పథకం ప్రకారం శ్రీకాంత్‌ను వారి ఇంటికి రప్పించి రోకలి బండతో కొట్టి హత్య చేసినట్లు విచారణలో వెల్లడైందన్నారు. నిందితులను ఈ నెల 19వ తేదీ పట్టణ శివారులోని కౌలేపల్లి వద్ద అరెస్టు చేసి వారి నుంచి హత్యకు ఉపయోగించిన రోకలి బండను స్వాధీనం చేసుకున్నారు. వారిని కదిరి మేజిస్ట్రేట్ ముందు హాజరు హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించడంతో అనంతపురం జిల్లా జైలుకు తరలించారు.

సెబ్ అధికారుల దాడులు

పుట్టపర్తి రూరల్ : జిల్లా ఎస్పీ మాధవరెడ్డి ఆదేశాలతో సెబ్ అధికారులు ఆదివారం జిల్లా వ్యాప్తంగా మద్యం అక్రమ రవాణాపై దాడులు ముమ్మరం చేశారు. తనకల్లు సెబ్ స్టేషన్ పరిధిలోని జి.ఆకులకొత్తపల్లిలో 2 ఎన్‌డిపిఎల్ కేసులు నమోదు చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి 75 కర్నాటక మద్యం టెట్రా పాకెట్స్ స్వాధీనం చేసుకున్నారు. హిందూపూరం సబ్ స్టేషన్ పరిధిలో గొర్రిపల్లి క్రాస్, పరిగి మండలంలో ఒక ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేసి 192 కర్నాటక మద్యం టెట్రా పాకెట్స్ స్వాధీనం చేసుకున్నారు. మడకశిర సబ్ స్టేషన్ పరిధిలో 1 ఎన్‌డిపిఎల్ కేసు నమోదు చేసి ఒకరిని అరెస్టు చేసి 27 కర్నాటక మద్యం టెట్రా పాకెట్స్ స్వాధీనం చేసుకున్నారు.

మట్టిలో ఇరుక్కున్న ఇసుక టిప్పర్

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండల పరిధిలోని ఉప్పలపాడు రీచ్ నుంచి ట్రిప్పర్‌లో ఇసుక రవాణా చేస్తుండగా ఆదివారం ఇసుక ట్రిప్పర్ రాళ్ల అనంతపురం క్రాస్‌లో మట్టిలో ఇరుక్కుపోయింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. అయితే ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

ప్రయాణికురాలికి నగదు, సెల్‌ఫోన్ అప్పగింత

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ధర్మవరం-నంద్యాల బస్సు సర్వీసులో శనివారం పోగొట్టుకున్న నగదు, సెల్‌ఫోన్‌ను ఆదివారం ఆర్టీసీ అధికారులు ప్రయాణికురాలికి అందజేశారు. ఆర్టీసీ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరం డిపో నుంచి నంద్యాల రూట్ వెళ్లి తిరిగి వచ్చే సమయంలో ధర్మవరం పట్టణానికి చెందిన త్రివేణి శనివారం సాయంత్రం ధర్మవరం రావడానికి అనంతపురంలో బస్సు ఎక్కింది. బస్సు ధర్మవరం చేరుకున్నాక ఆమె పర్సు మరిచిపోయి వెళ్లింది. దానిని కండక్టర్ పోతిరెడ్డి గుర్తించి, అందులో ఉన్న సెల్‌ఫోన్, రూ. 11వేలు నగదును ఆర్టీసీ అధికారులకు అప్పగించారు. వారు ప్రయాణికురాలి అడ్రస్ తెలుసుకుని ఫోన్ చేసి జరిగిన విషయాన్ని తెలిపారు. దీంతో ఆమె ధర్మవరం డిపో వద్దకు రావడంతో ఆమెకు ఆర్టీసీ అధికారులు పర్సును అందజేశారు.

ప్రయాణికురాలికి నగదు, సెల్‌ఫోన్ అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

ఇందిరా గాంధీకి నివాళి

హిందూపురం : భారత ఉక్కు మహిళ, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ నాయకులు బాలాజీమనోహర్ ఇందిరాగాంధీ ప్రధానిగా దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు రవూఫ్, జమీల్, నాయకులు మహబూబ్‌బాషా, ఫయాజ్, అజ్మతుల్లా, బిసి సెల్ ప్రెసిడెంట్ తిరుపాల్, ఆయాజ్, ఇలియాజ్, ఎండి గౌస్, సద్రుల్లా, మలగూరు బాబు, దాసన్న, ముబారక్, ఫకృద్దీన్, సయ్యద్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా గాంధి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పట్రకులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్రంలోని పట్ర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, న్యాయవాది ఎ.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో ఆదివారం ఎపి పట్రకుల సంక్షేమ సంఘం రాష్ట్ర నూతన కమిటీ పరిచయ వేదిక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్ర కులస్తులకు చట్టసభల్లో ప్రాధాన్యత కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పట్ర కులానికి ప్రత్యేక ఉద్యోగాలు కల్పించాలనే నినాదంతో పని చేస్తామన్నారు. కార్యక్రమంలో నూతన కమిటీ సభ్యులు, పట్ర కుల నాయకులు పాల్గొన్నారు.

వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు విరాళం

కదిరి టౌన్ : ధర్మవరం పట్టణ సమీపంలోని పోతుకుంటకాలనీలో వాల్మీకి విగ్రహం ఏర్పాటుకు ఎపి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బంగారు కృష్ణమూర్తి రూ. 10వేలు విరాళం అందజేశారు. రాష్ట్రంలో వాల్మీకి విగ్రహం లేని గ్రామం ఉండకూడదనేదే నా లక్ష్యమని కృష్ణమూర్తి వారికి తెలిపారు.

నరేష్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని చర్చిలో మైక్ ఇన్‌ఛార్జిగా పని చేస్తున్న నరేష్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి, కేసు నమోదు చేయచాలని సిఐటియు, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. వారు ఆదివారం ఆసుపత్రికి వెళ్లి నరేష్‌ను పరామర్శించారు. నరేష్ వైద్య ఖర్చులను నిర్వాహకులే బరించాలన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, సిఐటియు నాయకులు రాము, చంద్ర, గని, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో బ్యాటరీ వాహనం ప్రారంభం

పుట్టపర్తి అర్బన్ : ప్రశాంతి నిలయం అతిథి గృహాల్లో ఉండే వృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం ఆదివారం సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ స్థానిక గణేష్ గేట్ వద్ద బ్యాటరీ వాహనాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 12 సీట్లు కలిగి, కాలుష్యం వెదజల్లని ఈ వాహనంలో గణేష్ గేట్ నుంచి అతిథి గృహాలకు చేర్చుతారని, వృద్ధులు, వికలాంగులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు, సత్యసాయి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎపిఎల్ బాలికల క్రికెట్ పోటీల విజేత కదిరి

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనంత ప్రీమియర్ లీగ్(ఎపిఎల్) అండర్-16 బాలికల క్రికెట్ పోటీల్లో ధర్మవరం జట్టుపై కదిరి జట్టు విజయం సాధించినట్లు కోచ్ నజీర్ తెలిపారు. మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం జట్టులో ఓపెనర్లు తేజుదీపిక(62), చైత్ర(46) రాణించడంతో నిర్ణీత 30 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 190 పరుగులు చేశారు. తేజశ్విని-2, నిత్య, వెన్నెల చెరో వికెట్ తీశారు. కదిరి జట్టు ఓపెనర్లు వింధ్య(44), నిత్య (38), సారథి శారద(18), తేజశ్విని(51)లతో రాణించడంతో 2 ఓవర్లు మిగిలుండగానే విజయం సాధించారు. మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా సాధన పాఠశాల హెడ్‌మాస్టర్ సాధిక్ హాజరయ్యారు. కార్యక్రమంలో సనావుల్లా, వెంకటసాయి, సాయి, ధర్మవరం కోచ్ రాజశేఖర్, పిఇటి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్య స్పందన

మడకశిర : రొళ్లలోని మురళీ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణలో ఆదివారం డాక్టర్ దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో గుండె పరీక్షలు, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారిని నంద్యాల శాంతి రామ్ ఆసుపత్రి పంపారు.

పోటాపోటీగా ఎల్ఇడి స్క్రీన్స్ ఏర్పాటు

హిందూపురం : ఇండియా, ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరుగుతున్న వరల్డ్ కప్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా పట్టణంలో పోటాపోటీగా ఎల్ఇడి స్క్రీన్స్ ఏర్పాటు చేశారు. ఎంజిఎం క్రీడా మైదానంలో వైసిపి ఇన్‌ఛార్జి దీపిక ఆధ్వర్యంలో పెద్ద ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. ఎపి ఆగ్రోస్ ఛైర్మన్ నవీన్ నిశ్చల్ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలో ఎల్ఇడి స్క్రీన్ ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని క్రీడాభిమానులు, యువతీ, యువకులు, ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి మ్యాచ్‌ను వీక్షించారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

హిందూపురం : ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 27, 28తేదీల్లో చేపట్టిన 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు పట్టణ కార్యదర్శి నరసింహప్ప పిలుపునిచ్చారు. ఈ విషయంపై ఆదివారం పట్టణంలోని ఇందిర పార్కులో ఆశా వర్కర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలపై చర్చించారు. సమావేశంలో సిఐటియు నాయకులతో పాటు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పార్కులో సమావేశం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

అభివృద్ధిని విస్మరించిన జగన్ రాష్ట్రానికి అవసరమా?

ప్రజాశక్తి-కదిరి టౌన్

150 తలల రాక్షసుడు రాష్ట్రాన్ని పరిపాలిస్తూ అభివృద్ధిని విస్మరించిన సిఎం జగన్ ఎపికి అవసరమా అని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్, జనసేన ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ ప్రశ్నించారు. టిడిపి-జనసేన పార్టీల ఉమ్మడి కార్యాచరణ పోరాటాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని కోనేరు వద్ద రోడ్ల దుస్థితిపై నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు గుంతలమయం కావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా ప్రాణాలు సైతం కోల్పోతున్నారన్నారు. ఏటా కోట్ల రూపాయలు మంజూరవుతున్నా వైసిపి ఎమ్మెల్యేలు, నాయకుల జేబుల్లోకి వెళ్తున్నాయన్నారు. అసమర్థ పులికేసి జగన్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే బాహుబలి స్థాయిలో ప్రచారం నిర్వహించుకుంటూ మురిసిపోతున్నారని ఆరోపించారు. పట్టణంలోని హిందూ శ్మశానవాటిక ఎదురుగా గుంతలమయమైన రోడ్డులో ప్రమాదం జరిగి ఒకరు ప్రాణాలు కోల్పోగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డాడన్నారు. బైపాస్ రోడ్డు, కోనేరు అభివృద్ధి మాటేమిటని స్థానిక ఎమ్మెల్యేని నిలదీశారు. జనసేన, టిడిపి ఆధ్వర్యంలో ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై ప్రజలకు వివరిస్తామని వైసిపిని గద్దెదించే రోజులు దగ్గరపడ్డాయన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరిలో టిడిపి, జనసేన ఆధ్వర్యంలో రోడ్ల దుస్థితిపై నిరసన తెలుపుతున్న నాయకులు

మడకశిర : రాష్ట్రంలో గుంతలు పూడ్చలేని ముఖ్యమంత్రి మూడు రాజధానులు కడతారా అని టిడిపి-జనసేన నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయా పార్టీల అధినేతలు చంద్ర బాబు, పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆదివారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో పట్టణంలోని మధుగిరి రోడ్డులో గుంతల రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. అనంతరం గుండుమల విలేకరులతో మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చిన పుటి నుంచి రాష్ట్రంలో రోడ్లన్నీ గుంతలమయయ్యాయని, నాలుగన్నరేళ్లలో ఒక్క గుంతైనా పూడ్చలేదన్నారు. కార్యక్రమంలో టిడిప రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, విశ్రాంత ఇంజినీర్ మల్లికార్జున, క్లస్టర్ ఇన్‌ఛార్జి కళ్లుమర్రి సర్పంచి నాగరాజు, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు భక్తర్, పట్టణ అధ్యక్షుడు మనోహర్, మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, మీడియా కోఆర్డినేటర్ రవికుమార్, మున్సిపల్ ఛైర్మన్లు సుబ్బరాయుడు, కౌన్సిలర్ నరసింహరాజా, ప్రధాన కార్యదర్శి కోట్ల రంగేగౌడ్, నియోజకవర్గ జనసేన కన్వీనర్ రంగస్వామి, పట్టణ అధ్యక్షుడు శివాజీ, కౌన్సిలర్ శ్రీనివాస్, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి క్రైమ్ : సిఎం జగన్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా రహదారులు గుంతలమయంగా ఉన్నాయని టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ విమర్శించారు. మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లి బైపాస్ రోడ్డులో ఆదివారం 'ఈ గుడ్డి ప్రభుత్వాన్ని కళ్ళు తెరిపిద్దాం' అనే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా జగన్ పాలనలో ఒక్క రహదారి కూడా నిర్మించలేదన్నారు. వైసిపి ప్రజాప్రతినిధులు పదవుల కోసం పాకులాడుతున్నారే తప్ప రహదారుల మరమ్మతులు చేద్దామని, కొత్త రహదారులు నిర్మిద్దామనే ఆలోచన చేయడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్‌చౌదరి, నరసింహులు, బిసి వాల్మీకి నాయకుడు పీట్ల గంగాధర్, రమణ, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : రోడ్ల అభివృద్ధి, మరమ్మతులు చేయడంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఎస్.శ్రీనివాసులు, మండల కన్వీనర్ రామకృష్ణ తెలిపారు. స్థానిక పుట్టపర్తి రోడ్డులోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నాలుగున్నరేళ్లుగా ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోలేదని టిడిపి నాయకులు, కార్యకర్తలు అక్కడ నిరసన చేపట్టారు. అనంతరం గుంతలో మట్టి వేసి పూడ్చి ఏశారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు బోయ రాజు, సాకల సుబ్బరాయుడు, బైరాపురం లక్ష్మీనారాయణ, సుబ్బరాయుడు, కేసప్ప, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సమావేశమైన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని నిడిమామిడి ఉన్నత పాఠశాలలో 40 ఏళ్ల క్రితం చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిశారు. ఈ పాఠశాల ఏర్పడిన తర్వాత 1984-85, 1985-86 విద్యా సంవత్సరాల్లో చదివిన మొదటి, రెండవ బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారు నాటి గురువులు వెంకటప్ప, నబిసాబ్, వెంకట రాముడు, ఇస్మాయిల్‌లను ఘనంగా సత్కరించారు. గతంలో పనిచేసిన నలుగురు ఉపాధ్యాయులు నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి, శివయ్య కీర్తిశేషులు అయిన కారణంగా వారి భార్యలను సత్కరించి గురుభక్తిని చాటుకున్నారు పూర్వ విద్యార్థి డాక్టర్ నండ్లూరి ప్రభాకర్ మాట్లాడుతూ పాఠశాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, వివేకానంద కళాశాలల కరస్పాండెంట్ రవీంద్ర రూ. లక్ష విరాళం అందించారు. మరో పూర్వ విద్యార్థి 20 కుర్చీలు వితరణ చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన ఉపాధ్యాయులు శ్రీరాములు, వెంకటసాయి, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

కళ్లను కాపాడుకోవాలి

ధర్మవరం టౌన్ : ప్రతి ఒక్కరూ కళ్లను కాపాడుకోవాలని జిల్లా అంధత్వ నివారణ రిటైర్డ్ అధికారి, కంటి వైద్య నిపుణులు డాక్టర్. ఎస్.నరసింహులు పేర్కొన్నారు. పట్టణంలోని ఎస్బిఐ కాలనీలో ఉన్న మధు కంటి వైద్యశాలలో ఆదివారం చక్కెర వ్యాధిగ్రస్తులకు ఉచిత కంటి రెటీనా పరీక్ష శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నేటి ఈ ఉచిత కంటి రెటీనా పరీక్ష శిబిరానికి 53 మంది కంటి లోపాలు ఉన్న వారు వచ్చారని, వారందరికీ ఉచిత రెటీనా వైద్య చికిత్సతో పాటు మందులు పంపిణీ చేశామన్నారు. అంతేకాకుండా ఈ శిబిరంలో రక్త పరీక్ష, రక్తపోటు పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి అనూహ్యస్పందన

ధర్మవరం టౌన్ : స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం బెంగళూరుకు చెందిన కావేరి ఆసుపత్రి సౌజన్యంతో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఈ శిబిరంలో పలు రకాల జబ్బులకు 140 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ వైకె.శ్రీనివాసులు, కార్యదర్శి సుంకు సుకుమార్, ట్రెజరర్ రాధాక్రిష్ణ, క్యాంప్ ఛైర్మన్లు జయరాం, నాగేంద్ర, సభ్యులు చాంద్‌బాషా, పోలా ప్రభాకర్, ఒ.వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేడు నియోజకవర్గ టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశం

మడకశిర : పట్టణంలోని బాలాజీ నగర్‌లో ఉన్నా టిడిపి కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు నియోజకవర్గ టిడిపి-జనసేన ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని మడకశిర పట్టణంతో పాటు ఐదు మండలాల కన్వీనర్లు, ప్రధాన కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, రాష్ట్ర కమిటీ నాయకులు, ప్రస్తుత, మాజీ ప్రజాప్రతినిధులు, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ అనుబంధ సంఘాల నాయకులు, తెలుగు యువత, ఐటీడీపీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, టిఎన్ఎస్ఎఫ్, టిఎన్‌టియుసి నాయకులు, కార్యకర్తలు, ఎన్‌బికె, ఎన్టీఆర్ అభిమాన సంఘాల నాయకులు, జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని కోరారు.

కొల్లాపురమ్మ ఆలయానికి ఎమ్మెల్యే రూ. 10 లక్షల విరాళం

చెన్నేకొత్తపల్లి : మండల కేంద్రమైన చెన్నేకొత్తపల్లిలో వెలసిన కొల్లాపురమ్మ ఆలయ అభివృద్ధికి రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి రూ. 10 లక్షల విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు.

వాల్మీకి విగ్రహావిష్కరణ

హిందూపురం : పట్టణంలోని కొట్నూరులో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. వైసిపి ఇన్‌ఛార్జి దీపిక వాల్మీకి విగ్రహానికి పూలమాల వేశారు. వాల్మీకులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బేల్దారి శ్రీనివాసులు, కృష్ణారెడ్డి, వాల్మీకి నాయకులు మారుతి, రామకృష్ణప్ప, క్రిష్టప్ప, వైసిపి నాయకులు శివశంకర్ రెడ్డి, వివేక్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, వాల్మీకి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి దివ్య పల్లకి ఉత్సవం

రొద్దం : శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం రొద్దం పురవీధుల్లో శ్రీసత్యసాయి బాబా దివ్య పల్లకి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఊరేగింపులో మండలంలో ఉన్న సేవా సమితి సభ్యులు, అన్ని భజన మండలి సభ్యులు, బాలవికాస్ బాలురు, బాలికలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

నంబులపూలకుంట : మండల కేంద్రమైన నంబులపూలకుంటలోని వైఎస్ఆర్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఓ మురికి నీటి గుంటలో చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. అవి చాలా రోజులుగా నిల్వ ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుండడంతో ఇటువైపు రావాలంటే స్థానికులు జంకుతున్నారు. తప్పనిసరి పరిస్థితిలో ఇటుగా వచ్చినా ముక్కులు మూసుకొని రాకపోకలు సాగిస్తున్నారు. దీనికితోడు దోమలు వృద్ధి చెంది చుట్టుపక్కల ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇకనైనా పంచాయతీ సిబ్బంది, సంబంధిత అధికారులు స్పందించి చెత్తచెదారం తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు

ఆర్ఎంపి వైద్యుడి మృతికి యుటిఎఫ్ నాయకుల సంతాపం

ప్రజాశక్తి-మడకశిర

పట్టణ సమీపంలోని ఆర్.అనంతపురం గ్రామానికి చెందిన రామ్మూర్తి(63) ఆదివారం మృతిచెందాడు. ఈయన మూడు దశాబ్దాలుగా పట్టణంలోని పావగడ-హిందూపూరం రోడ్డు లో ప్రజా వైద్యశాల ఏర్పాటు చేసి ప్రజలకు నిస్వార్థ సేవలు అందించారు. రామ్మూర్తి సేవలు పేద, బడుగు, బలహీన, దళిత వర్గాలకు దూరమవడం తీరని లోటు అని, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) నాయకులు కె.భూతన్న, విఎన్.మాలింగప్ప, హెచ్.సుదర్శన్, కదురన్న, మహేష్, పవన్ పేర్కొన్నారు.

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-గోరంట్ల

మండల పరిధిలోని మలసముద్రం గ్రామ పంచాయతీ సర్పంచి సువర్ణ అశ్వర్థరెడ్డి ఆదివారం సొంత నిధులతో జెసిబి వాహనం ఏర్పాటు చేసి కోరేవాండ్లపల్లి నుంచి మల సముద్రం గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించారు. ఈ మార్గంలో రోడ్డుకు అడ్డంగా కంప చెట్లు దట్టంగా పెరగడంతో మలసముద్రం గ్రామానికి వెళ్లేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. సర్పంచి చొరవ తీసుకుని కంపచెట్లను తొలగించడంతో గ్రామస్తులు హర్ష వ్యక్తం చేస్తున్నారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కొత్తచెరువు

విద్యార్థినులు మహిళా చట్టాల గురించి తెలుసుకోవాలని గ్రంథాలయ అధికారి జయరాం, ఉపాధ్యాయులు అనంతలక్ష్మి. సుకన్య తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయంలో విద్యార్థినులకు దిశా చట్టం, మహిళా సాధికారితపై సమా వేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని, అవసరమైనప్పుడు ఈ చట్టాలను ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల అధ్యాపకులు నజీర్‌బాషా, రాముడు, ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, రాధాలక్ష్మి, సాయి సుశీల, మాధవీలత, స్థానిక జూనియర్ కళాశాల. బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ నగర్‌లో ఉన్న ప్రధాన శాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అధికారిని అంజలి సౌభాగ్యవతి ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా దిశా చట్టం, మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ టీచర్ ముత్యాలప్ప, టీచర్ కాంతమ్మ ముందుగా ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలను వివరించారు. తదుపరి దిశా చట్టం ఉపయోగాలు, మహిళా సాధికారతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది రమణనాయక్, శివమ్మ, గంగాధర్, ముకుంద, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ : 56 జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక గ్రంథాలయం లో అధికారి కమలనాభరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ కార్యాలయంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రంథాలయ శాఖ అధికారి కమలనాభరావు మాట్లాడుతూ ఆమె పోరాట స్ఫూర్తిని, స్వతంత్ర భారత వనితల్లో తొలి మహిళ ప్రధానిగా ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అలాగే భారత స్వాతంత్ర సంగ్రామ పోరాటంలో పాల్గొన్న వీరవనిత సరోజినీనాయుడు, విజయలక్ష్మి పండిట్, ఝాన్సీ లక్ష్మీబాయి, సావిత్రిబాయిపూలే గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

కొత్తచెరువులో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు